సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 29 । మే । 2025



పల్లెల్లో 'ప్రత్యేక' పాట్లు

ప్రత్యేకాధికారుల పాలనలో పర్యవేక్షణ కొరవడడంతో గ్రామాలు పారిశుద్ధ్య సమస్యతో సతమతం అవుతున్నాయి.

8లో



ఆ ఎనిమిది మంది మాటేంటి..?

భద్రాచలంలో మాడ వీధుల విస్తరణకు భూసేకరణ పనులు సాగుతున్నా.. ఎనిమిది మాత్రం ఇళ్లు ఖాళీ చేయడం లేదు.

8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విధిగా నిబంధనలు పాటించాలని పౌర సరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. రైతులు కూడా ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లబ్ధి పొందాలని కోరారు. 2023 – 24 యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2,289 మంది రైతుల నుంచి 13,642.680 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.29.79 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని, 2024 – 25 సీజన్‌లో 144 కొనుగోలు కేంద్రాల ద్వారా 49,527.320 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 7,297 మంది రైతుల ఖాతాల్లో రూ.114.61 కోట్లు జమ చేశామని వివరించారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 6,500 మంది రైతుల నుంచి రూ.103.43 కోట్ల విలువైన 44,700.640 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు.

క్రీడల్లో ప్రతిభ చాటాలి

జూలూరుపాడు : క్రీడల్లో ఉన్నతంగా రాణించి, జిల్లా రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ చాటాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పరంధామ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మండలంలోని నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే క్రీడల్లో ఉన్నతంగా రాణించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరళ, కోచ్‌లు శివాజీ, అభి తదితరులు పాల్గొన్నారు.

ముంపు ముప్పుపై ప్రణాళికేది?



భద్రాచలం రామాలయం చుట్టూ చేరిన వరదనీరు(ఫైల్)

భద్రాచలం ఏజెన్సీకి ఈసారీ తప్పని వరద పోటు

- తక్షణ ఏర్పాట్లపైనే దృష్టి సారిస్తున్న సర్కారు
- శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టని వైనం
- పత్తా లేని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నైరుతి రుతుపవనాలు ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్రను ముందుగానే పలకరించాయి. ఇప్పటికే విస్తారంగా వర్షాలు కురవడం మొదలైంది. అయితే వానలు, వరదల విషయంలో ముందస్తు జాగ్రత్తలు, అప్రమత్తత మాత్రం కనిపించడం లేదు.

ప్రతీ ఏడాది వరదలు..

ప్రతీ ఏడాది వానాకాలంలో గోదావరికి వరదలు రావడం సర్వసాధారణం అవుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 53 అడుగులు దాటితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. భద్రాచలంతో పాటు దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు, అశ్వాపురం మండలాల్లోని లోతట్టు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి గోదావరిలో నీటి మట్టం 40 అడుగులకు పైగా పెరగొచ్చనే అంచనాలు రాగానే జిల్లా అధికారులు, మంత్రులు అప్రమత్తమై సమీక్షలు నిర్వహిస్తారు. తగు చర్యలు తీసుకుంటారు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా భద్రాచలం పట్టణానికి గోదావరి వరద ముంపు నుంచి శాశ్వతంగా విముక్తి కలిగించే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. కేవలం వరదలప్పుడు చేపట్టే తక్షణ ఏర్పాట్లపైనే శ్రద్ధ పెడుతుండడం విమర్శలు తావిస్తోంది.

జాడలేని సీవరేజ్..

వానాకాలంలో మురుగునీటి సమస్యకు తాత్కాలిక పరిష్కారంగా భారీ మోటార్లు పెట్టి వరద, మురుగు నీటిని ఎత్తి తోడేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ఇదే తంతు కొనసాగుతోంది. కానీ శాశ్వత పరిష్కారం చూపే విషయంపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. ఆధ్యాత్మిక కేంద్రంగా పట్టణానికి ఉన్న ప్రాశస్త్యం, భవిష్యత్ అవసరాలను దృష్ట్యా పట్టణంలో వెలువడి గోదావరిలో కలుస్తున్న మురుగునీటిని దృష్టిలో ఉంచుకుని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి ఉంది. గతేడాది ఈ ప్లాంట్ కోసం ప్రతిపాదనలు పంపాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. కానీ ఆ తర్వాత ఈ అంశంపై ఎలాంటి పురోగతి లేదు.

ఫాయిదా లేని కొత్త కరకట్ట..

కూనవరం రోడ్డు వైపు గత 20 ఏళ్లుగా అసంపూర్తిగా మిగిలిపోయిన కరకట్ట పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదలెట్టారు. చకచకా పనులు జరిగాయి. అయితే జగ్‌దల్‌పూర్ – విజయవాడ నేషనల్ హైవే మీదుగా ఈ కరకట్ట నిర్మించాల్సి ఉంది. దీంతో జాతీయ రహదారుల సంస్థ ఇక్కడ వంతెన నిర్మించాలి. అయితే ఏడాదిన్నరగా ఈ వంతెన నిర్మాణ పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా కరకట్ట నిర్మాణం జరిగినా రోడ్డు దగ్గర ఆగిపోయాయి. గతేడాది వరద సందర్భంగా రోడ్డుపై తాత్కాలికంగా మట్టికట్ట వేయాల్సి వచ్చింది. ఈసారి అదే జరగనుంది. ఇక భద్రాచలం – దుమ్ముగూడెం మధ్య నాలుగైదు చోట్ల గోదావరి నీరు రోడ్డుపైకి చేరి రాకపోకలకు అడ్డుగా నిలుస్తోంది. ఇక్కడ వంతెన నిర్మాణాలకు ఇచ్చిన హామీల అమలుపైనా ఫోకస్ చేయాల్సిన అవసరం ఉంది.

మురుగు సమస్య

గోదావరి నదిలో వరద 30 అడుగుల వరకు చేరితే భద్రాచలం పట్టణంలో వెలువడే మురుగునీరు స్లూయిస్‌ల ద్వారా నదిలోకి వెళ్లే వీలు లేదు. ఈ మురుగు నీరు వెనక్కి వచ్చి ఆలయం సమీపంలో ఉన్న విస్తా కాంప్లెక్స్, మిథిలా స్టేడియం, పోకల దమ్మక్క అన్నదాన కేంద్రాలను ముంచెత్తుతుంది. ఇదే సమయంలో పట్టణంలో వర్షం ఎక్కువ పడితే భద్రగిరి కొండ చుట్టూ నీరు చేరుతుంది. భద్రాచలం మునిగిపోయిందనే వార్తలు వెల్లువెత్తడంతో ఇక్కడికి వచ్చే భక్తులు తగ్గుతున్నారు. ఆలయ ప్రాంగణం అపరిశుభ్రంగా మారుతోంది. నీరు ఎత్తిపోసిన తర్వాత మిగిలే బురద, బ్లీచింగ్ తదితర వ్యవహారాలతో ఆలయం పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతే కాదు ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతింటోంది.

అంగన్‌వాడీల బలోపేతంపై దృష్టి



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్, ఎమ్మెల్యేలు

- పల్లెల్లో తాగునీటి సమస్య రావొద్దు
- సమన్వయంతో పనిచేస్తూ లక్ష్యం సాధించాలి
- సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రి సీతక్క
- పంచాయతీరాజ్ పనుల్లో నిర్లక్ష్యంపై ఆగ్రహం

చుంచుపల్లి : వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో జరిగే వాస్తవాలను మాత్రమే ప్రభుత్వ దృష్టికి తేవాలని, తద్వారా ఏమైనా లోటుపాట్లుంటే సరిచేసుకోవచ్చని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. కలెక్టరేట్‌లో ఐసీడీఎస్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖల పనితీరుపై ఉమ్మడి జిల్లా అధికారులతో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. చిన్నారులకు అవసరమైన వసతులు సమకూర్చుతున్నామని, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఈ కేంద్రాలను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రాథమిక పాఠశాలల సమీపంలోనే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఖాళీల భర్తీకి సన్నాహాలు చేస్తున్నామన్నారు. మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణాల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని సూచించారు. గ్రామీణ ప్రాంత పిల్లల ఆలనా పాలన కోసం క్రష్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులను పట్టించుకోని వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.

సురక్షిత తాగునీరు అందించాలి..

మారుమూల ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ సమస్యలపై వారం పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని అన్నారు. ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టిన అధికారులను అభినందించారు. కాగా, పంచాయతీరాజ్ శాఖలో మంజూరైన పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లు పూర్తయిన పనులు ఎందుకు చేయడం లేదని మండిపడ్డారు. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకుంటే బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. గిరిజనుల అభివృద్ధికి రోడ్లు, బ్రిడ్జిల ఏర్పాటు ముఖ్యమని, ప్రతీ గ్రామానికి కనెక్టివిటీ ఉండేలా రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, కమిషనర్ కాంతివెస్లీ, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, రాందాస్ నాయక్, మట్టా రాగమయి, మహిళా శిశు సంక్షేమ శాఖ జేడీ సునంద, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అదనపు కలెక్టర్లు విద్యాచందన, శ్రీజ, సంక్షేమాధికారులు లెనినా, రాంగోపాల్‌రెడ్డి, డీపీఓలు ఆశాలత, చంద్రమౌళి, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత పాత కొత్తగూడెం – పెనుబల్లి గ్రామాలను కలిపే హై లెవల్ బ్రిడ్జి పనులకు సీతక్క నేడు శంకుస్థాపన చేయనున్నారు.

సహజత్వం ఉట్టిపడేలా గిరిజన మ్యూజియం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఆవరణలోని గిరిజన మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రతి వస్తువు, చిత్రాలు సహజత్వం ఉట్టిపడేలా ఉన్నాయని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం రాత్రి ఆమె గిరిజన మ్యూజియాన్ని సందర్శించారు. పెయింటింగ్ చిత్రాలతో పాటు పాతకాలపు మట్టి ఇళ్లు, చిన్నారుల ఆట స్థలం, బోటింగ్ పాయింట్, బాక్స్ క్రికెట్, బీచ్ వాలీబాల్ గ్రౌండ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నమ్మకానికి, విశ్వాసానికి గిరిజనులు పెట్టింది పేరని, ఎలాంటి కల్తీ లేకుండా సబ్బులు, తినుబండారాలు అమ్ముతూ ఉపాధి పొందాలని మహిళలకు సూచించారు. ఇక్కడి దేవతామూర్తులు, పాతకాలపు కళాఖండాలు, పనిముట్లు చూస్తుంటే చిన్ననాటి స్మృతులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. గిరిజన జీవన విధానాలను తెలియజేసేలా మ్యూజియం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

మరోసారి కిన్నెరసాని సందర్శన

ములకలపల్లి/ పాల్వంచరూరల్: కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్‌డీ) బృందం సభ్యులు రాకేశ్‌కుమార్, వివేక్‌కుమార్ కేసరి బుధవారం ములకలపల్లి, సీతారాంపురం గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన కుంటలు, నర్సరీలు, మెగా ప్రకృతి వనాలను చూసి, ఉపాధి కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశాల్లో వసతులు కల్పిస్తున్నారా, బిల్లులు సకాలంలో అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో ములకలపల్లి – మూకమామిడి మధ్య నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. వారి వెంట ఎంపీడీఓ గద్దె రేవతి, ఇన్‌చార్జ్ ఎంపీఓ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ సురేష్, జీపీ కార్యదర్శి రవి తదితరులు ఉన్నారు. కాగా, పాల్వంచ మండలంలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని మంగళవారం సందర్శించిన సభ్యులు బుధవారం కూడా వెళ్లి జలాశయంలో బోటింగ్ చేశారు.




ములకలపల్లి : మెగా ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కిన్నెరసానిలో ట్రెయినీ బీట్ ఆఫీసర్లు

పాల్వంచరూరల్ : హైదరాబాద్ ధూల్‌పేట ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 40 మంది ట్రెయినీ బీట్ అధికారులు బుధవారం కిన్నెరసానిని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి డీర్‌పార్కుతో పాటు అటవీ సంరక్షణ విధి విధానాలపై రేంజర్ అవగాహన కల్పించారు. అనంతరం జలాశయంలో బోటు షికారు చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ కృష్ణప్రసాద్, రేంజర్ కవితామాధురి, బీట్ ఆఫీసర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

■ మహా వృక్షం.. మోడైంది !





దశాబ్దాలుగా ఎంతో మందికి నీడనిచ్చిన మహావృక్షం (మర్రిచెట్టు) బుధవారం మోడుగా మారింది. పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న ఈ చెట్టుకింద స్థానికులు, పోలీస్‌స్టేషన్‌లో పని కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు సేద తీరేవారు. కాగా, రోడ్డు విస్తరణలో భాగంగా ఈ చెట్టును తొలగించడంతో ఆ ప్రాంతమంతా బోసిపోయి కనిపిస్తోంది.

– అశ్వారావుపేటరూరల్

కొండరెడ్ల సంక్షేమానికి కృషి

- ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం
- ఐటీడీఏ పీఓ రాహుల్

అశ్వారావుపేటరూరల్: మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసించే కొండరెడ్లకు సంక్షేమ పథకాలు, జీవనోపాధి కల్పించేలా కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. మండలంలోని తిరుమలకుంట, గోగులపూడి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. తిరుమలకుంటలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు ఉన్నాయని, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కొండరెడ్లు కోరగా.. సర్వే చేసి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గవర్నర్ దత్తత గ్రామమైన గోగులపూడిలో పర్యటించి కొండరెడ్లు తయారీ చేసిన వెదురు ఉత్పత్తులను పరిశీలించారు. వీటి విక్రయానికి మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని, వ్యాపారాన్ని విస్తరించాలని సూచించారు. కొండరెడ్ల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. లబ్ధిదారుల గుర్తింపునకు ఈనెలాఖరు లోగా ఇంటింటి సర్వే చేసి వారం రోజుల్లో అందరికీ మంజూరు పత్రాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన రైతులకు ఇందిరా గిరి జల వికాసం పథకం కింద బోరు, మోటార్, డ్రిప్ కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. పోడు పట్టాలున్న భూముల్లో ఆయిల్‌పాం, మునగ, వెదురు పెంపకం చేపట్టాలని, అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరల పంటలు సాగు చేయాలని కోరారు. యువత జీవనోపాధి పొందేందుకు మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ, యువకులకు సెల్‌ఫోన్ రిపేర్లు, ఆడియో, వీడియో రంగాలపై శిక్షణ అందిస్తామని వివరించారు. ఐటీడీఏ ద్వారా నిర్వహించే జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శ్రీ గుబ్బల మంగమ్మ ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, జేడీఎం హరికృష్ణ, హౌసింగ్ ఏఈ మదన్, కార్యదర్శులు కార్తీక్, సందీప్ పాల్గొన్నారు.



గోగులపూడిలో వెదురు కళాకృతులను పరిశీలిస్తున్న పీఓ రాహుల్ తదితరులు

రైతులకు ఊరట..



వరి పంట

- పంటల మద్దతు ధరలు పెంచిన కేంద్రం
- పత్తికి క్వింటాకు రూ. 589, ధాన్యం క్వింటాకు రూ.69 పెంపు

బూర్గంపాడు: వానాకాలం రైతులు పండించే పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించింది. బుధవారం జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో 2025 – 26 సంవత్సరానికి గాను కనీస మద్దతు ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అత్యధికంగా నువ్వులు క్వింటాకు రూ. 820, రాగులు రూ.596, పత్తి క్వింటాకు రూ.589 మేర మద్దతు ధర పెంచింది.

14 రకాల పంటలకు..

రైతులు పండించే 14 రకాల పంటలకు మద్దతు ధరలు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వరికి క్వింటాకు రూ. 69, జొన్నకు రూ. 328, సజ్జలు రూ.150, రాగులు రూ. 596, మొక్కజొన్న రూ. 175, కంది రూ. 450, పెసర రూ. 86, మినుములు రూ. 400, వేరుశనగ రూ.480, పొద్దుతిరుగుడు రూ. 441, సోయాబీన్ రూ.436, కుసుమలు రూ. 579, ఒలిసెలు రూ. 820, పత్తి క్వింటాకు రూ.589 మద్దతు ధరలు పెంచుతున్నట్లు ప్రకటించింది.

జిల్లాలో పత్తి, వరి సాగు అధికం..

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో రైతులకు కొంతమేర ఊరట కలగనుంది. పంటల సాగులో పెట్టుబడి ఖర్చులు పెరగడం, దిగుబడి తగ్గుతుండడంతో నష్టాలు వస్తున్నాయి. ఈ ఏడాది జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో పత్తి, ఆ తర్వాత స్థానంలో వరి సాగు చేస్తున్నారు. పత్తికి క్వింటాకు రూ. 589 మద్దతు ధర పెంపుతో రైతులకు కొంతమేర లబ్ధి చేకూరనుంది. గతేడాది పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.7,521గా ఉంది. పెంచిన ధరతో ఈ ఏడాది క్వింటాకు రూ.8110 మద్దతు ధర దక్కనుంది. వరికి క్వింటాకు రూ. 69 పెంచింది. సాధారణ రకం ధాన్యం క్వింటా గతేడాది రూ. 2,300 ఉండగా ఈ ఏడాది రూ. 2369కి, 'ఏ' గ్రేడ్ రకం ధాన్యం క్వింటాకు గతేడాది రూ. 2,320 ఉండగా ఈ ఏడాది రూ. 2,389కి పెరగనుంది. ఇంకా తృణ ధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలకు కూడా ధర పెరిగినా.. జిల్లాలో వాటి సాగు అంతంత మాత్రమే. మద్దతు ధరల పెంపు నేపథ్యంలో ఆ పంటలు కూడా సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సి ఉంది.

ఇకపై పంటల ధరలు ఇలా..

రకం	క్వింటాకు(రూ.ల్లో)		
ధాన్యం(సాధారణ)	2,369	మొక్కజొన్న	2,400
ధాన్యం 'ఏ' గ్రేడ్	2,389	కందులు	8,000
పత్తి(పింజ పొడవు)	8,110	పెసలు	8,768
పత్తి(మధ్యస్థ పింజ)	7,710	మినుములు	7,800
జొన్న	3,699	వేరుశనగ	7,263
పచ్చజొన్న	3,749	పొద్దుతిరుగుడు	7,721
సజ్జలు	2,775	సోయాబీన్	5,328
రాగులు	4,886	కుసుమలు	9,846
		ఒలిసెలు	9,537



పత్తి పంట

ధాన్యానికి రూ. 100 పెంచాలి



పత్తికి క్వింటాకు రూ.589 మద్దతు ధర పెంచడం సంతోషకరం. దీంతో రైతులకు ఎకరాకు రూ.5వేల వరకు ఆదాయం పెరుగుతుంది. అయితే ధాన్యానికి క్వింటాకు రూ.69 మాత్రమే పెంచారు. వరిసాగు ఖర్చులు పెరుగుతున్నందున క్వింటాకు కనీసం రూ.100 పెంచాలి.

– దారం రాజశేఖర్‌రెడ్డి, సంజీవరెడ్డిపాలెం

క్లుప్తంగా

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రైవేటు ఆస్పత్రులలో బుధవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జయలక్ష్మి తనిఖీలు చేశారు. నిర్దేశిత గడువులోపు అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల యజమానులు ఫారమ్ ఎఫ్‌ను సమర్పించాలని సూచించారు. ఫైజా మోహినుద్దీన్, సోమ్లా నాయక్ పాల్గొన్నారు.

జవాన్‌కు ఘనసన్మానం

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామపంచాయతీ భద్రుతండా గ్రామానికి చెందిన బానోత్ దమ్మిలాల్ జమ్ము కశ్మీర్ కూల్గాం జిల్లాలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల పాకిస్తాన్ ఉగ్రమూకలను అణచివేసేందుకు భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ఆయన పాల్గొన్నాడు. సెలవుపై మంగళవారం రాత్రి స్వగ్రామమైన భద్రుతండాకు చేరుకోగా, బుధవారం దమ్మిలాల్‌ను ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ వాంకుడోత్ సరోజిని, రాందాస్, విజయ్, భోజ్యా, రవికుమార్, రమేష్, లక్ష్మణ్, భావ్‌సింగ్, సురేష్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

ఆర్టీసీ సిబ్బంది చొరవతో రూ. లక్ష తిరిగి అప్పగింత

మణుగూరు రూరల్: టీజీ ఆర్టీసీ మణుగూరు డిపో బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును అధికారులు బుధవారం తిరిగి అప్పగించారు. మణుగూరు నుంచి ఏపీలోని అమలాపురం వెళ్లి వస్తున్న బస్సులో మంగళవారం అశ్వారావుపేటకు చెందిన ప్రయాణికుడు రూ. లక్ష నగదు ఉన్న పర్సును పోగొట్టుకున్నాడు. అనంతరం బాధితుడు ఆర్టీసీ అధికారులకు తెలపడంతో వారు డ్రైవర్ ఇల్లటూరి మహేష్‌ను అప్రమత్తం చేశారు. దీంతో డ్రైవర్ బస్సులో తనిఖీ చేయగా నగదుకు కలిగిన పర్సు దొరికింది. ఆర్టీసీ అధికారులు బుధవారం డిపో కార్యాలయ ఆవరణలో బాధితుడికి పర్సును అందజేశారు. ఈ సందర్భంగా డ్రైవర్, ఆర్టీసీ అధికారులను పలువురు అభినందించారు.

కుక్క కరిచి చిన్నారి మృతి


నిహారిక(ఫైల్)

సుజాతనగర్: పిచ్చి కుక్క కరిచిన ఐదేళ్ల చిన్నారి వైద్యం పొందుతూ మంగళవారం మృతి చెందింది. గ్రామస్తులకథనం ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన బానోత్ రమేష్, స్వప్న దంపతుల కుమార్తె బేబీ నిహారిక గాయత్రి(5) ఈ నెల 13న ఆడుకునేందుకు ఇంట్లో నుంచి బయటకు రాగా, పిచ్చి కుక్క కరిచింది. దీంతో తీవ్రంగా గాయపడగా, చిన్నారిని కొత్తగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లి 15 రోజులపాటు వైద్యం అందించారు. గత ఆదివారం నుంచి చిన్నారి విచిత్రంగా ప్రవర్తించడం, నోట్లోనుంచి నురగ రావడంతో ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. చిన్నారి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

గుండెపోటుతో రికార్డు అసిస్టెంట్..

అశ్వాపురం: తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న సంగారెడ్డి జిల్లా విజయ్‌నగర్ కాలనీకి చెందిన మన్నె రమేష్(49) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. గత ప్రభుత్వం వీఆర్‌ఓలను తొలగించి పలుశాఖల్లో సర్దుబాటు చేయగా రమేష్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుగా అసిస్టెంట్‌గా చేరాడు. ఇటీవల వీఆర్‌ఓల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం వచ్చే నెల 2న నియామకాలు చేపట్టనుంది. ఈ నెల 28న వీఆర్‌ఓ వెరిఫికేషన్ కోసం రమేష్ సంగారెడ్డి జిల్లాలో తన స్వస్థలానికి వెళ్లాడు. మంగళవారం రాత్రి పడుకున్నాక ఛాతీ నొప్పి రావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. తహసీల్దార్ రాజారావు, ఆర్ఐ లావణ్య, సిబ్బంది సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

సుజాతనగర్: రెండు బైక్‌లు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఖమ్మం–కొత్తగూడెం ప్రధాన రహదారిపై నాయకులగూడెం గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ ఎం.రమాదేవి కథనం ప్రకారం.. నాయకులగూడెం గ్రామానికి చెందిన దండు శ్రీనివాస్ (49) బైక్‌పై సుజాతనగర్ వస్తున్నాడు. అదే సమయంలో జూలూరుపాడుకు చెందిన పూనెం బాలకృష్ణ మరో ద్విచక్రవాహనంపై కొత్తగూడెం వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో శ్రీను ఎగిరి రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: భార్య మృతితో మనోవేదనకు గురై భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని నందిపాడు గ్రామానికి చెందిన పద్దం కృష్ణారావు (49) భార్య విజయ ఏడాదిన్నర క్రితం అనారోగ్యానికి గురై మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదనతో మద్యానికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లెల్లో ‘ప్రత్యేక’ పాట్లు


ఎన్‌కే నగర్ పంచాయతీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

గ్రామపంచాయతీలు	481
జిల్లా పరిషత్	1
మండల పరిషత్‌లు	22

- గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు
- పంచాయతీలను పట్టించుకోని ప్రత్యేకాధికారులు
- మున్సిపాలిటీల్లోనూ అదే తీరు

చుంచుపల్లి: ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. పల్లెలు పారిశుద్ధ్య సమస్యతో సతమతమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. గతేడాది జనవరితో సర్పంచుల పదవీకాలం ముగియగా ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారులకు అప్పగించారు. ఎంపీపీ, జెడ్పీ పాలక మండళ్ల గడువు సైతం గతేడాది ఆగస్టు మొదటి వారంతో ముగియగా, అక్కడా స్పెషల్ ఆఫీసర్ల పాలనకు ప్రభుత్వం ఆదేశించింది. ఇక కొత్తగూడెం, ఇల్లెందు పురపాలికల్లోనూ పాలక వర్గాల గడువు ఈ ఏడాది జనవరిలో ముగియగా పాలన బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించారు. వివిధ ప్రభుత్వశాఖల్లో పని చేస్తున్న మండల స్థాయి అధికారులకు ఒక్కొక్కరికి 2 నుంచి 4 గ్రామాల చొప్పున అదనపు బాధ్యతలు కేటాయించారు. జెడ్పీకి కలెక్టర్ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తుండగా, మండల పరిషత్‌లకు జిల్లా స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. కొత్తగూడెం, ఇల్లెందు రెండు మున్సిపాలిటీల పాలన పర్యవేక్షణను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు అప్పగించారు.

కార్యదర్శులపైనే భారం

స్థానిక సంస్థల పాలన పట్టించుకోవాల్సి అధికారులు కనీసం అటువైపు రావడం లేదనే ఆరోపణలున్నాయి. భారం అంతా గ్రామాల్లో కార్యదర్శుల పైనే పడుతోంది. మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ప్రత్యేకాధికారులు కూడా పాలనను పట్టించుకోవడంలేదనే పలువురు పేర్కొంటున్నారు. దీంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నెలల తరబడి ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధుల విడుదల చేయకపోవడంతో పాలన పూర్తిగా పడకేసింది. వర్షాకాలం సీజన్‌ను ప్రారంభమవుతున్నా దృష్టా ప్రత్యేక అధికారులు మేల్గొనాలని ప్రజలు కోరుతున్నారు.

లోపిస్తున్న జవాబుదారీతనం

పదవీకాలం ముగిసి ఏడాది దాటినా సర్పంచ్ ఎన్నికల నిర్వహణ ఎప్పుడన్నది స్పష్టతలేదు. మండల, జిల్లా పరిషత్‌ల పాలన గడువు ముగిసి పది నెలలు అవుతున్నా ఎన్నికలకు ప్రభుత్వం విముఖత చూపుతోంది. ప్రత్యేకాధికారులు పనిభారం తదితర కారణాలతో గ్రామ పాలన పట్టించుకోవడంలేదు. తమకు సొంత శాఖ విధులతోనే సరిపోతోందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. దీనికితోడు స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అధికారులతో జవాబుదారీతనం కూడా లోపిస్తోంది. పాలనాభారం గ్రామ కార్యదర్శులు మోస్తున్నా నిధులు లేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రత్యేక అధికారులను నియమించినా ప్రజలకు అందుబాటులో ఉండటంలేదు. కాగా ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసంతో పాటు మరికొన్ని పథకాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లిన తర్వాత జూలైలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తున్నట్టు తెలుస్తోంది.

అధికారులు పర్యవేక్షించాలి



గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి. ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. వర్షాకాలం సీజన్‌లో అప్రమత్తంగా ఉండాలి. సమస్యలు ఏమైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులను మరోసారి ఆదేశిస్తాం.

– ఎం.విద్యాచందన, అదనపు కలెక్టర్

ఎన్నికలు నిర్వహించాలి



ప్రత్యేకాధికారులు గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. మరోవైపు పల్లెల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోవడంతో పాలన కుంటుపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి.

– మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శి

ఆ ఎనిమిది మంది మాటేంటి..?


భద్రాచలంలో జేసీబీతో ఇళ్లు కూల్చివేస్తున్న దృశ్యం

- భూ సేకరణలో పూర్తి కాని నష్టపరిహారం
- ఇళ్లను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు
- ఒక వైపు ఖాళీలు, మరో వైపు దర్జాగా దుకాణాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా మాడ వీధుల విస్తరణలో భూ సేకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. రెండు, మూడు రోజులుగా పాక్షిక పరిహారం తీసుకున్న చిరు వ్యాపారులు, భూ యజమానులు దుకాణాలు, ఇళ్లను ఖాళీ చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు బుధవారం ఆ ఇళ్లను తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. అయితే రామాలయానికి వచ్చే భక్తుల రద్దీ, స్థానికుల రాకపోకలు అధికంగా సాగుతుండడంతో రాత్రి వేళల్లోనే పూర్తి చేయాలని నిర్ణయించారు. కాగా పరిహారం తీసుకున్న వారు ఖాళీ చేసినా, తీసుకునేందుకు విముఖత చూపిన ఎనిమిది మంది ఇళ్ల తొలగింపు, స్వాధీనంపై మాత్రం స్పష్టత రాలేదు. దీంతో ఆ భవనాల్లో అద్దెకు దుకాణాలను నిర్వహిస్తున్న వారు దర్జాగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

కలెక్టర్ చొరవ చూపితేనే..

మాడ వీధుల విస్తరణలో ఆలయం చుట్టుపక్కల 40 ఇళ్లను తొలగించాలని దేవస్థానం, రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. ఇందుకు 32 మంది అంగీకరించగా.. అధికారులు మూడో వంతు నష్టపరిహారం కూడా అందజేశారు. మిగితా మొత్తం ఇళ్ల ఖాళీ చేశాక ఇచ్చేందుకు పరస్పర అంగీకారం కుదిరింది. దీంతో వారంతా ఇళ్లు, షాపులు ఖాళీ చేసి వెళ్లిపోయారు. అయితే ఎనిమిది మంది మాత్రం ప్రభుత్వ నష్ట పరిహారం సరిపోవడం లేదంటూ స్వీకరణకు విముఖత చూపారు. గతంలో సైతం ఆలయ విస్తరణ సమయంలో ఒప్పుకోని ఇద్దరితో పాటు మరో ఆరుగురు ఈసారి కూడా ముందుకురాలేదు. పరిహారం పెంచితేనే ఖాళీ చేస్తామంటూ భీష్మించారు. దీంతో ఆ ఎనిమిది ఇళ్ల తొలగింపు అడ్డుగా మారింది. పడమర మెట్లకు ఎదురుగా కొన్ని, దక్షిణం వైపున కొన్ని ఇళ్లు అలాగే ఉండిపోనున్నాయి. దీనిపై కలెక్టర్ చొరవ చూపితేనే రామాలయ అభివృద్ధిపై ప్రభుత్వ హామీ ముందుకు కదిలే పరిస్థితి కనిపించడం లేదు. కాగా ఖాళీ చేసిన భూ యజమానులకు బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కేటాయిస్తామని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. గతంలోనే ఆ స్థలాన్ని చదును చేశామని, త్వరలోనే లాటరీ పద్ధతిలో నిర్వాసితులకు అప్పగిస్తామని తేల్చి చెప్పారు.

ప్రభుత్వంపై నమ్మకం పెట్టడమే తప్పా..

ప్రభుత్వంపై నమ్మకంతో, అధికారులు ఇచ్చిన నష్ట పరిహారం తీసుకున్న చిరువ్యాపారులు, దుకాణ యజమానులు ఇప్పుడు అసంతృప్తివ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవులు పూర్తికాకపోవడంతో భక్తుల రద్దీ నెలకొంది. ఈ నేపథ్యంలో వ్యాపారాలు ఉన్నప్పటికీ హనుమాన్ జయంతి అనంతరం ఖాళీ చేస్తామని చెప్పిన మాట ప్రకారం స్థలాలను అప్పగించారు. అయితే పరిహారం తీసుకోని ఆఎనిమిది భవనాల్లోని అద్దె దుకాణాల్లో మాత్రం దర్జాగా వ్యాపారాలు సాగుతున్నాయి. దీంతో ఖాళీ చేసిన దుకాణాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందరికీ సమన్యాయం జరిగేలా ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

త్వరలోనే స్థలాలు అప్పగిస్తాం



భూ సేకరణ పనులు వేగంగా నడుస్తున్నాయి. ఇళ్లు కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్నాం. నష్టపరిహారం అందుకోని వారు సైతం తొలి దశలో అంగీకరించినవారే. వారితో సంప్రదింపులు జరిపి పూర్తి చేస్తాం. లేదంటే కోర్టు ద్వారా ఆ ఇళ్లను తొలగించి స్వాధీనం చేసుకుంటాం. ఖాళీ చేసిన వారు ఆందోళన చెందొద్దు. బ్రిడ్జి పాయింట్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలాన్ని త్వరలోనే నిర్వాసితులకు అప్పగిస్తాం.

– దామోదర్ రావు, ఆర్‌డీఓ

సర్కార్ వైద్యంపై భరోసా


ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు సేవలు పొందుతున్న ఐఏఎస్, ఐపీఎస్ కుటుంబీకులు

పాల్వంచ: ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యానికి గతంలో పేద, మధ్య తరగతి ప్రజలే ఎక్కువగా వచ్చేవారు. అక్కడి వాతావరణం, అరకొర సిబ్బంది, వైద్యుల పలకరింపు, సిబ్బంది పనితీరు పట్ల కొంత ఆందోళన చెందేవారు. ఇప్పుడు అందుకు భిన్నంగా ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా ఉండటంతోపాటు ఆధునిక వైద్య పరికరాలు, స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులోకి వచ్చారు. దీంతో ఉన్నతస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం పొందుతున్నారు. ఈ క్రమంలోనే బుధవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తన భార్య శ్రద్ధ పాటిల్ కాన్పు కోసం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా, మగబిడ్డ జన్మించాడు. ఆస్పత్రిలో వసతులు మెరుగ్గా ఉన్నాయని కలెక్టర్ కితాబు ఇవ్వడం విశేషం.

పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లు కూడా..

గతంలో భద్రాచలం పీఓగా, ఖమ్మం కలెక్టర్‌గా విధులు నిర్వహించిన వీపీ.గౌతమ్ 2018 అక్టోబర్ 28న భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో తన సతీమణికి ప్రసవం చేయించారు. 2020 ఆగస్టు 27న అప్పటి ఎస్పీ సునీల్ దత్ సతీమణి కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించారు. ఏఎస్పీ శబరీష్ సతీమణి, ఖమ్మం అదనపు కలెక్టర్ స్నేహలత కూడా ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం పొందారు. గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అనుదీప్ సైతం తన సతీమణి మాధవికి భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ప్రసవం చేయించి ఆదర్శంగా నిలిచారు. ఈ క్రమంలో ప్రస్తుత కలెక్టర్ జితేష్ తన సతీమణికి ప్రభుత్వాస్పత్రిలో కాన్పు సేవలు పొందారు.

పెద్దమ్మతల్లి ఆలయ అటెండర్ సస్పెన్షన్

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న లింగంపల్లి లింగయ్యను సస్పెండ్ చేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి బుధవారం తెలిపారు. మంగళవారం విధినిర్వహణలో ఉండి ఎలాంటి అనుమతి తీసుకోకుండా బయటకు వెళ్లడం, మద్యం తాగి విధులకు హాజరైనట్లు ఆరోపణలు రావడంతో తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

- మహబూబాబాద్‌లో ఘటన

మహబూబాబాద్ రూరల్: ఆర్మీ ఉద్యోగం కోసం శిక్షణ తీసుకుంటున్న ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ఉప్పల సింగారం కాలనీకి చెందిన పెండెం రాజేశ్వరరావు కుమారుడు కార్తీక్ (17) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీవీ నాయక్ డిఫెన్స్ అకాడమీలో ఆర్మీ ఉద్యోగం కోసం శిక్షణ తీసుకుంటున్నాడు. నెలరోజులుగా క్రితం అకాడమీకి వచ్చిన అతను బుధవారం రాత్రి బహిర్భూమికని తరగతి గది నుంచి బయటకు వచ్చాడు. కోచింగ్ సెంటర్ భవనంపైకి ఎక్కి తన ప్యాంట్ తీసుకుంటుండగా సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. కోచింగ్ సెంటర్ నిర్వాహకులు గమనించి చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కాగా, కార్తీక్ విద్యుత్ వైర్లు పట్టుకోవడంతోనే షాక్‌కు గురై మృతిచెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టౌన్ ఎస్సై అలీమ్ హుస్సేన్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యేకు కన్నీటి వీడ్కోలు

- నివాళులర్పించిన మంత్రి తుమ్మల, వివిధ పార్టీల నేతలు
- పాడె మోసిన ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, ఐడీసీ చైర్మన్ విజయ్‌బాబు తదితరులు

రఘునాథపాలెం: వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ మదన్‌లాల్ అంత్యక్రియలను బుధవారం ఆయన స్వగ్రామమైన రఘునాథపాలెం మండలం ఈర్లపుడిలో నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఆయన మృతదేహాన్ని మంగళవారం ఖమ్మం కవిరాజ్‌నగర్‌లోని నివాసగృహానికి తీసుకురాగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఈర్లపుడికి తరలించగా, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు మదన్‌లాల్ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను ఓదార్చారు. ఆ తర్వాత అంత్యక్రియల్లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు పాడె మోశారు. అలాగే, ఇల్లెందు, జనగామ ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పల్లా రాజేశ్వర రెడ్డి, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, సండ్ర వెంకటవీరయ్య, తాటి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ మాలోతు కవితతో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తుళ్లూరి బ్రహ్మయ్య, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, దిండిగల రాజేందర్, బెల్లయ్యనాయక్, కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, అజ్మీరా వీరూనాయక్, మాదంశెట్టి హరిప్రసాద్, గుత్తా రవి, మెంటెం రామారావు, పిన్ని కోటేశ్వరరావు, చెరుకూరి ప్రదీప్, కూరాకుల వలరాజు, నాగండ్ల కోటి, మానుకొండ రాధాకిశోర్ తదితరులు సైతం మదన్‌లాల్ మృతదేహం వద్ద నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి

132 గ్రాముల బంగారం స్వాధీనం

మణుగూరు టౌన్: వ్యసనాలకు బానిసై చోరీలను అలవాటుగా మార్చుకున్న అంతర్రాష్ట్ర దొంగను మణుగూరు పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రవీంద్రరెడ్డి కథనం ప్రకారం.. ఈ నెల 23న మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లోని శ్రీవారి జ్యూయలరీలో 13 తులాల బంగారం చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో హనుమాన్ టెంపుల్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి పోలీసులను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకుని విచారించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భీమవరానికి చెందిన గొర్రెల సత్యనారాయణ ఆరు బంగారు చైన్లు, నల్లపూసల గొలుసు, చిన్న పిల్లల రింగులు 5 మొత్తం 132 గ్రాముల బంగారం అపహరించినట్లు అంగీకరించాడు. వరంగల్, తిరుపతి, కర్నూలు ప్రాంతాల్లో కూడా చోరీలు చేసినట్లు విచారణలో తేలింది. గతంలో అతనిపై సుమారు 30 కేసులు ఉన్నాయి. నిందితుడిని బుధవారం మణుగూరు కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ తెలిపారు.

చోరీలు ఇలా...

మంగళ, శుక్రవారాల్లో బంగారం దుకాణాల యజమానులు పూజలు నిర్వహిస్తుంటారు. ఆ సమయంలోనే సత్యనారాయణ రెక్కీ నిర్వహిస్తూ, కొనుగోళ్లు చేసినట్లు ఏమార్చి షో కేస్‌లో ఉన్న బంగారం అపహరిస్తుంటాడని పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్ఐ మేడ ప్రసాద్, సీసీఎస్ ఎస్ఐ రామారావు, కానిస్టేబుల్ రామారావు, వెంకటనారాయణ, విజయ్‌లను డీఎస్పీ రవీంద్రరెడ్డి అభినందిస్తూ నగదు రివార్డును అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని గౌతమిపురం వద్ద బుధవారం మోటార్‌సైకిల్‌ను కారు ఢీ కొట్టిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. బూర్గంపాడులోని గిరిజన ఆశ్రమ పాఠశాల(బాలికలు)లో వంటమనిషిగా పనిచేస్తున్న కుర్సం జానకమ్మ(51) తమ బంధువు మోటార్‌సైకిల్‌పై బుధవారం మధ్యాహ్నం పాఠశాలకు వస్తోంది. ఈ క్రమంలో గౌతమిపురం వద్ద ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న జానకమ్మ తారురోడ్డుపై పడిపోయింది. తలకు తీవ్ర గాయాలు కావటంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. బైక్ నడుపుతున్న బంధువుకు, మధ్యలో కూర్చున్న ఆమె మనవడికి కూడా తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలు ఆంధ్రప్రదేశ్‌లోని వీఆర్‌పురం మండలవాసి కాగా, ఉద్యోగ రీత్యా బూర్గంపాడులో ఉంటోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


జానకమ్మ మృతదేహం

జేకే ఓసీ విస్తరణకు అనుమతులు


జేకే ఓసీ విస్తరించే ప్రదేశం ఇదే

1.9 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి సింగరేణి సన్నాహాలు

ఇల్లెందు: జేకే–5 ఓసీ విస్తరణకు అడ్డంకులు తొలగిపోయాయి. పర్యావరణ, అటవీ అనుమతులు లభించాయి. ఈ మేరకు బుధవారం సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య వివరాలు వెల్లడించారు. జేకే–5 ఓసీ మూతపడనున్న నేపథ్యంలో యజమాన్యం పలువురు ఉద్యోగులను బదిలీ చేసింది. జేకే ఓసీ విస్తరణ అనుమతుల్లో జాప్యం జరిగింది. పలు దఫాలు ప్రయత్నించినా కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు ఆలస్యం కావటంతో ఓసీ విస్తరణ పట్ల ఆందోళన వ్యక్తమైంది. సీఎండీతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో పలు దఫాలు సింగరేణి అధికారులు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, గుర్తింపు సంఘం నాయకులు ఒత్తిడి పెంచడంతో తుది అనుమతులు బుధవారం లభించాయి. దీంతో కార్మికులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా 2023 ఏప్రిల్ 26న జేకే ఓసీ విస్తరణకు సింగరేణి ప్రజాభిప్రాయం సేకరించింది. రూ.297.88 కోట్లతో 1114.507హెక్టార్ల భూమిలో 2.50 మిలియన్ టన్నుల బొగ్గు సేకరణ కోసం అనుమతి కోరారు. ప్రస్తుతం 1.9 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే అనుమతి లభించినట్లు జీఎం తెలిపారు. విస్తరణ పనులు చేపట్టి బొగ్గు వెలికితీతకు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆసుపాక బీపీఎంపై సస్పెన్షన్ వేటు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని ఆసుపాక బ్రాంచ్ పోస్టుమాస్టర్ శశాంక్‌పై బుధవారం తపాలా శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. గడిచిన ఏడాది కాలంగా గ్రామస్తులకు పోస్టు ద్వారా వచ్చిన ఉత్తరాలు, ఆధార్, ఏటీఎం, బీమా, ఇతర నోటీసు పత్రాలను పంపిణీ చేయడం లేదని, ఈ నెల 26వ తేదీన గ్రామస్తులు వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో అదే రోజు పోస్టుమాస్టర్ శశాంక్‌పై గ్రామస్తులు లిఖిత పూర్వకంగా అశ్వారావుపేట ఎస్పీఎం సాయిబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో పాల్వంచ డివిజన్ ఇన్‌చార్జి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామ్మూర్తి ఆసుపాక గ్రామంలో విచారణ చేశారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలను నమోదు చేసి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన పోస్టుమాస్టర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.